అన్ని హంగులతో కమ్యూనిటీ హాల్

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ



నిర్మాణాల గురించి సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: అన్ని హంగులతో కమ్యూనిటీహాల్, చిల్డ్రన్ పార్క్‌ను నిర్మిస్తామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్‌లో రూ.3 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే ఫంక్షన్ హాల్, చిల్డ్రన్ పార్కు నిర్మాణ స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీజేఆర్ నగర్‌లో రూ.2 కోట్లతో ఫంక్షన్ హాల్, రూ.కోటి అంచనా వ్యయంతో చిల్డ్రన్ పార్కు నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. పీజేఆర్ నగర్ వాసుల చిరకాల కోరిక త్వరలో నెరవేరబోతుందన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన ఫంక్షన్ హాల్‌ను సకల సౌకర్యాలతో నిర్మిస్తామని వివరించారు. పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఫంక్షన్ హాల్‌లో వివిహ శుభకార్యాలు, సమావేశాలు, సభలు, జన్మదిన వేడుకలు నిర్వహించేకునేందుకు వీలుగా ఫంక్షన్ హాల్ ఉపయోగపడుతుందన్నారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎక్కడా రాజీపడకూడదని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. పార్కులో మొక్కలు నాటి సంరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. ఫంక్షన్ హాలు, చిల్డ్రన్ పార్కు నిర్మాణాలపై అధికారులకు ఎమ్మెల్యే సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఈఈ గోవర్ధన్, ఏఈ శ్రావణి, వర్కు ఇన్‌స్పెక్టర్ మహదేవ్, రవి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్, జిల్లా గణేష్, మారెళ్ల శ్రీనివాస రావు, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

గణితాన్ని సులభ పద్ధతుల్లో బోధించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ హరిశ్చంద్ర

కూకట్‌పల్లి: గణితాన్ని విద్యార్థులకు సులభ పద్ధతులో బోధించాలని ఎంఈఓ ఎం.హరిశ్చంద్ర అన్నారు. కూకట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్‌లో కూకట్‌పల్లి, బాలానగర్, కుత్బుల్లాపూర్, బాచుపల్లి మండలాల గణిత ఉపాధ్యాయులకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే, లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాంపై ఒక్కరోజు శిక్షణను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో జరిగే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే నందు విద్యార్థుల ఫలితాలు మెరుగ్గా ఉండేలా వారిని తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి కిషన్, కాంప్లెక్స్ నోడల్ అధికారి నరేందర్ రెడ్డి, గణిత రిసోర్స్ పర్సన్స్ హరిణి, పర్మగళ్ల నర్సింహులు, 67 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదిలోనే అడ్డుకట్ట దిశగా..

- మేడ్చల్ జిల్లాలో కొనసాగుతున్న ఎన్‌సీడీ సర్వే
- 30 ఏళ్లు దాటిన వారిపై ప్రత్యేక శ్రద్ధ.. నిర్ధారణ పరీక్షలు
- బీపీతో 1.15 లక్షలు, షుగర్ బాధితులు 72 వేల మంది గుర్తింపు
- ఆహార నియమాలు పాటించేలా జిల్లా వైద్యారోగ్య శాఖ అవగాహన కార్యక్రమాలు



సాక్షి,సిటీబ్యూరో: ఉరుకులు, పరుగుల జీవితంలో ఆహారపు అలవాట్లు మారాయి. దీనికి తోడూ సాంకేతికత పెరిగి శారీరక శ్రమ తగ్గడంతో వ్యాధులు చుట్టుముడుతున్నాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు, కేన్సర్లు ఇలా రకరకాల దీర్ఘకాలిక వ్యాధులతో చాలామంది బాధపడుతున్నారు. పట్టణ జనాభా అధికంగా ఉన్న మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఇదే ధోరణి ఎక్కువగా ఉంది. దీంతో వాటిని ఆదిలోనే కట్టడి చేసి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి జిల్లా వైద్యారోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. 30 ఏళ్లు దాటిన వారి ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసేందుకు అసంక్రమిక వ్యాధుల నిర్ధారణ (ఎన్‌సీడీ) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ప్రస్తుతం జిల్లాలో మూడో విడత సర్వే కొనసాగుతోంది.

ఆదిలోనే గుర్తించేలా..

మధుమేహం, రక్తపోటు, వివిధ రకాల కేన్సర్లను ఆదిలోనే గుర్తించి నివారించాలన్న ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎన్‌సీడీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో మే నుంచి మూడో విడత సర్వే కార్యక్రమం కొనసాగుతోంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 30 ఏళ్లు దాటిన వారు 17 లక్షల మంది లక్ష్యంగా సర్వేను నిర్దేశించారు. ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీలు ఇంటింటికీ తిరుగుతూ పరీక్షలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 5,76,242 మందిని స్క్రీనింగ్ చేసి పరీక్షించగా 1.15 లక్షల మంది రక్తపోటు (బీపీ)తో 72 వేల మంది మధుమేహం (షుగర్) వ్యాధికి గురైనట్లు వైద్యాధికారులు గుర్తించారు. వారికి ప్రతి నెల ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి మళ్లీ పరీక్షలు చేసి మందులు అందిస్తున్నారు. అలాగే పలువురు వివిధ రకాల కేన్సర్లతో బాధపడుతున్నట్లు నిర్ధారించారు.

మారుతున్న ఆహారపు అలవాట్లు..

మారుతున్న ఆహారపు అలవాట్లు వ్యాధులకు దగ్గర చేస్తున్నాయి. చిన్న వయస్సులోనే జంక్ ఫుడ్, ఇతరత్రా వాటికి అలవాటు పడుతున్నారు. కళాశాల స్థాయికి చేరగానే ధూమపానం, మద్యపానంతో పాటు గంజాయికి బానిస అవుతున్నారు. దీంతో 30–40 ఏళ్ల వయస్సు వారి ఆరోగ్యంపై ప్రభావాన్ని చూపుతోంది. అలాగే ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులపై ఎక్కువగా ఒత్తిడి ఉంటుండడంతో వారు కూడా మధుమేహం, రక్తపోటు వంటి బారినపడి జీవిత కాలం మాత్రలు మింగాల్సిన పరిస్థితులు ఎదుర్కొంటున్నారు.

ఆహార నియమాలు పాటించాలి..

ఆహార నియమాలు పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. నిత్యం కొంత సమయాన్ని వాకింగ్, యోగాకు కేటాయించాలి. తద్వారా ఒత్తిడిని నియంత్రించి వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు. సమతుల్య ఆహారం తీసుకోవాలి. మధుమేహంతో బాధపడుతున్న వారు నిల్వ ఆహారం తీసుకోకుండా చూడాలి. జిల్లాలో ఎన్‌సీడీ సర్వే కొనసాగుతోంది. వ్యాధులు నిర్ధారణ అయిన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నాం.

– డాక్టర్, కౌశిక్, ఎన్‌సీడీ ప్రోగాం ఆఫీసర్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

కాంగ్రెస్‌లో కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు



వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లను సన్మానిస్తున్న సుంకన్న

మోతీనగర్: కాంగ్రెస్ పార్టీలో పదవులను ఆశించకుండా పార్టీ పటిష్టత కోసం పని చేసే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సుంకన్న అన్నారు. మంగళవారం అల్లాపూర్ డివిజన్ నుంచి ఇటీవల కూకట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా నియమించబడిన నరసింహ యాదవ్, జమీర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఆదిరెడ్డి హమీద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సుమిత్ర నగర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో పాల్గొన్న నరేష్, నాయకులు

కూకట్‌పల్లి: వివేకానందనగర్ నగర్ డివిజన్‌లోని సుమిత్ర నగర్‌లో మంగళవారం బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ నరేష్ హాజరై సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్థాగతంగా బీజేపీని మరింత బలోపేతం చేసే దిశగా సభ్యత్వ నమోదును చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నరేందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు నర్సింగరావు, సీనియర్ నాయకులు శ్రీహరి యాదవ్, శంకర్, లలితారెడ్డి, మమత హరీష్ తదితరులు పాల్గొన్నారు.

జామా మసీద్ కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

మూసాపేట: మూసాపేట జామా మసీద్ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చీఫ్ అడ్వైజర్‌గా మహ్మద్ కుర్షీద్ సాహెబ్, అడ్వైజర్‌లుగా అజీజ్ సాహెబ్, అక్తార్, అధ్యక్షుడిగా ఎండీ మహ్మద్, ఉపాధ్యక్షుడిగా షేక్ దస్తగీర్, జనరల్ సెక్రటరీగా ఎండీ. నజీర్, ఆర్గనైజర్‌గా సయ్యద్ షఫీయుద్దీన్, ట్రెజరర్‌గా ఎండీ శంషుద్దీన్, జాయింట్ సెక్రటరీగా ఎండీ సిజ్జూ ఖాన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా షేక్ హుస్సేన్, షేక్ ఖాదీర్, ఎండీ సాజిద్, ఎండీ ఇమ్రాన్, ఎండీ మొహిసిన్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహ్మద్ గౌసుద్దీన్, ముజహద్, చూన్నూ పాషా హాజరయ్యారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మియాపూర్: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మరణించిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ దుర్గ రామలింగ ప్రసాద్ కథనం ప్రకారం .. మంగళవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో మియాపూర్ నుంచి కూకట్‌పల్లి జాతీయ రహదారి మెట్రో పిల్లర్ నెంబర్ 622 బస్టాప్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి (35) తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని విచారించగా.. ఏ సమాచారం లభించలేదు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామన్నారు. సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

విద్యా ఉపాధి అవకాశాలపై అవగాహన



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సాధికారత కమిటీ ఫర్ డిఫరెంట్లీ ఏబుల్డ్ పర్సన్స్ (ఈసీడీఏపీ), చెన్నయ్‌కు చెందిన హెల్ప్ ది బ్లెండ్ ఫౌండేషన్(హెచ్‌టీబీఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో విద్యా ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఆర్ సిబ్బంది దివ్యాంగ విద్యార్థులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వడమే కాకుండా పలు అంశాలపై అవగాహన కల్పించారు. సోషియాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అన్నవరం, ఈసీడీఏపీ చైర్మన్ ప్రొఫెసర్ పమ్మి పవన్‌కుమార్ ఈ కార్యక్రమానికి సమన్వయకర్తలుగా వ్యవహరించారు.

రేపు జాబ్ మేళా

చందానగర్ : నిరుద్యోగ యువత కోసం జీహెచ్‌ఎంసీ సహకారంతో చందానగర్‌లోని లైట్‌హౌస్ కమ్యూనిటీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం 26వ తేదీ ఉదయం 10 గంటలకు జాబ్ మేళా జరగనుంది. లైట్ హౌస్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ నగరంలోని వివిధ కంపెనీలు (రిటైల్, బ్యాంకింగ్, లాజిస్టిక్స్, ఫార్మసీ, సేల్స్, ఐటీ, నాన్–ఐటీ) జాబ్ మేళాలో పాల్గొననున్నాయన్నారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇతర అర్హతలు కలిగిన విద్యావంతులైన నిరుద్యోగ యువత జాబ్ మేళాకు హాజరు కావచ్చన్నారు. అభ్యర్థులు తమ ఆధార్ కార్డు, 3 సెట్‌ల బయోడేటాలు తీసుకు రావాలని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ 8688100660 సంప్రదించవచ్చు.

‘మనూ’లో దూరవిద్య ప్రవేశాలకు 30 ఆఖరు

రాయదుర్గం: ‘మనూ’లో దూరవిద్య ప్రవేశాలకు 30వ తేదీ ఆఖరు అని ‘మనూ’ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ గుల్ఫిషాన్ హబీబ్ తెలిపారు. ఈ ప్రాస్పెక్టస్, దరఖాస్తు ఫారమ్ యూనివర్సిటీ వెబ్‌సైట్, అడ్మిషన్ పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రవేశ రుసుమును అక్టోబర్ 10వ తేదీ వరకు చెల్లించవచ్చని సూచించారు. ఎంఏ ఉర్దూ హిందీ, ఇంగ్లిష్, అరబిక్, హిస్టరీ, ఇస్లామిక్ స్టడీస్, బీఏ, బీకామ్, బీఎస్సీలో ప్రవేశాల కోసం దరఖాస్తులను కోరుతున్నామన్నారు.బీఎస్సీ లైఫ్ సైన్సెస్, బీఎస్సీ భౌతికశాస్త్రం, డిప్లొమా ఇన్ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, టీచ్ ఇంగ్లిష్, ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, స్కూల్ లీడర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ ఎంప్లాయబిలిటీ స్కిల్స్ ఇంగ్లిష్ ద్వారా ఉర్దూలో ప్రావీణ్యం, ఫంక్షనల్ ఇంగ్లిష్‌లో సర్టిఫికెట్ కోర్సు అందుబాటులో ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు.. స్టూడెంట్ సపోర్ట్ యూనిట్ హెల్ప్‌లైన్లు 040–23008463, 040 23120600, (ఎక్స్‌టెన్షన్ 2207, 2208)లో సంప్రదించాలని సూచించారు.

భూమి, వెట్టిచాకిరీ విముక్తి కోసమే తెలంగాణ సాయుధ పోరాటం

రాయదుర్గం: భూమి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసమే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సాగిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్ వీరయ్య పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యవక్తగా పాల్గొన్నారు. అంతకుముందు సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఆయన ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోని పేద ప్రజలకు భూమి కావాలనే నినాదాన్ని పార్లమెంటు వరకు తీసుకెళ్ళిన ఏకైక పోరాటం తెలంగాణ సాయుధ పోరాటమని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఎం శేరిలింగంపల్లి నాయకులు శోభన్, కృష్ణ, సుందరయ్య విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు సాంబశివరావు, అనీల్, విజయ్‌కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

అమృత్‌నగర్ వాసులకు ఇళ్లను కేటాయించాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



తండాలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, జెడ్‌సీ అపూర్వ చౌహాన్

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ అమృత్‌నగర్ తండా వాసులు నాలా పక్కనే కొన్ని సంవత్సరాలుగా నివాసం ఉంటున్నారని, వారికి ఇళ్లను కేటాయించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం ఆయన కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌తో కలిసి అమృత్‌నగర్ తండాలో పర్యటించారు. గతంలోనే కొంత మందికి లాటరీ ద్వారా ఇల్లు మంజూరైనట్టు గుర్తు చేశారు. మిగిలిన వారికి కైత్లాపూర్‌లో ఇళ్లను కేటాయించాలని కోరారు.

బయోటెక్ సమాజాన్ని ప్రోత్సహించడమే లక్ష్యం

ఎఫ్ఏబీఏ– తు దయూ మోట్ యూనివర్సిటీ ఒప్పందం



రాయదుర్గం: ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయో అసోసియేషన్స్ (ఎఫ్ఏబీఏ) మంగళవారం తు దయూ మోట్ విశ్వవిద్యాలయంతో అవగాహనా ఒప్పందం చేసుకుంది. వియత్నాంలో ఎఫ్ఏబీఏ అధ్యయనానికి ఆ యూనివర్సిటీతో ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందంపై రెండు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎఫ్ఏబీఏ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ రెడ్డన్న మాట్లాడుతూ వియత్నాంలో ఎఫ్ఏబీఏ విస్తరణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అభివృద్ధి చెందుతున్న బయోటెక్ సమాజాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఏబీఏ సెక్రెటరీ జనరల్ డాక్టర్ పి రత్నాకర్, తుడౌమోట్ విశ్వవిద్యాలయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్నోవేషన్ ఇన్‌ఫార్మాస్యూటికల్ అండ్ హెల్త్‌కేర్ ఫుడ్ డైరెక్టర్ డాక్టర్ న్యూయోన్ థిలియోన్ థువాంగ్, బిజినెస్ అసోసియేషన్ ప్రతినిధి న్యూయోన్ థాన్ టిన్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు, హెచ్‌సీయూ ప్రతినిధులు పాల్గొన్నారు.

ల్యాబ్ టు ల్యాండ్ అగ్రి సొల్యూషన్ సంస్థపై డీలర్ల ఫిర్యాదు



రాయదుర్గం: ల్యాబ్ టు ల్యాండ్ అగ్రి సొల్యూషన్ సంస్థ మోసం చేసిందని ఆరోపిస్తూ కొందరు డీలర్లు హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో మంగళవారం ఆందోళనకు దిగారు. అనంతరం బాధితులంతా రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్నను కలిసి ఫిర్యాదు చేశారు. సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో కార్యకలాపాలు సాగించే ల్యాబ్ టు ల్యాండ్ అగ్రి సొల్యూషన్స్ సంస్థ వ్యవసాయ ఎరువుల సరఫరా డీలర్‌షిప్‌లు ఇస్తామంటూ మోసం చేయడంతో కొందరు ఆందోళనకు దిగారన్నారు. తమ డబ్బులు మాత్రం ల్యాబ్ టు ల్యాండ్ సంస్థ కాజేసిందని డీలర్లు ఆరోపించారన్నారు. సంస్థ సీఈఓ ఆదిత్యపై గత ఏప్రిల్‌లో చీటింగ్ కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ వెంకన్న వివరించారు. లక్షల్లో డబ్బు తీసుకొని తమకు ఎరువులు సరఫరా చేయకుండా ఇబ్బందులు గురిచేస్తున్నారని, మరోసారి ఇదే సంస్థపై దాదాపు 25 మంది ఫిర్యాదు చేశారని సీఐ చెప్పారు. బాధిత డీలర్ల ఫిర్యాదులు స్వీకరించి కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.



జీహెచ్‌ఎంసీ అధికారిక అధ్యయన పర్యటనలో భాగంగా మేఘాలయ రాష్ట్ర రాజధాని షిల్లాంగ్‌లో కార్పొరేటర్లు పర్యటించారు. మున్సిపల్ బోర్డు సభ్యులతో వివిధ ప్రాంతాల్లోని పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణలో అవలంబిస్తున్న విధి విధానాలను డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతారెడ్డి, కార్పొరేటర్‌లు ఉప్పలపాటి శ్రీకాంత్, దొడ్ల వెంకటేష్‌గౌడ్, మంజుల రఘునాథ్ రెడ్డి, మాధవరం రోజాదేవి రంగారావు, నార్నే శ్రీనివాసరావులతో కలిసి పరిశీలించారు. మూఫ్లీనాంగ్‌లో గ్రామస్తులు పరిశుభ్రతకు అనుసరిస్తున్న విధి విధానాల గురించి వారిని అడిగి తెలుసుకున్నామని వారు తెలిపారు. – ఆల్విన్‌కాలనీ

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్‌కు చెందిన ఎం.రాంప్రసాద్‌కు రూ.3 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు మంజూరైంది. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారుడి కుటుంబ సభ్యులకు చెక్కును ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకొని ఆర్థికంగా బిల్లులు చెల్లించలేని నిరుపేదలు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా లబ్ధి పొందవచ్చని తెలిపారు.

డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరిపై కేసు

కుత్బుల్లాపూర్: సామాజిక సేవా కార్యకర్తల ముసుగులో హోటళ్ల నిర్వాహకులను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు మహిళలపై పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ విజయవర్ధన్ వివరాల ప్రకారం.. మలక్‌పేట్‌కు చెందిన బొగ్గుల సునీత(50), సికింద్రాబాద్ పద్మారావు నగర్‌కు చెందిన విజయలక్ష్మి(58) ఈ నెల 23వ తేదీన సుచిత్రలోని గిస్మత్ హోటల్‌కు వెళ్లారు. తాము ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ సభ్యులమని వంట గదిలోకి వెళ్లారు. మీ హోటల్‌లో అపరిశుభ్రత నెలకొందని, హోటల్‌ను మూయిస్తామని, తమకు డబ్బులు ఇస్తే వదిలేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో హోటల్ నిర్వాహకులు పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సునీత, విజయలక్ష్మి గతంలోనూ ఇదే విధంగా పలు హోటళ్ల నిర్వాహకుల నుంచి వసూళ్లకు పాల్పడినట్లు తెలుస్తోంది. పోలీసులు వారికి నోటీసులు అందజేశారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చింతల్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని లార్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు లయన్ సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం గణేష్ నగర్‌లోని లార్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో ఉచిత డెంటల్ క్యాంప్ నిర్వహించారు. మహిళలు, ఫాదర్ ఫ్రాన్సిస్ స్కూల్ విద్యార్థులు దంత పరీక్షలు చేయించుకున్నారు. దంతాల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో జీఆర్ సుజాత, సుష్మిత, వెంకట్, రాజేశ్వర్, వైద్యులు ప్రఫుల్ల, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అయ్యో.. ఎవరో వీరు



కేపీహెచ్‌బీకాలనీ: మానసిక పరిస్థితి బాగాలేని ఓ మహిళ, బాలుడిని కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు గుర్తించారు. సోమవారం రాత్రి నుంచి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కనీసం వారి పేరు, ఇంటి చిరునామా కూడా చెప్పలేని పరిస్థితిలో ఉన్నారని కేపీహెచ్‌బీ సీఐ వెంకటేశ్వర రావు వెల్లడించారు. వీరి వివరాలు తెలిసిన వారు కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.